# రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

సంప్రదించండి
ఫోన్: 93910 89608



ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 287 | పేజీలు: 4 | వెల: రూ.3/- | శుక్రవారం 24 జనవరి 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి


# పాత రికార్డులన్నీ బ్రేక్



## ఒకే రోజు మూడు కంపెనీల ద్వారా రాష్ట్రానికి రూ. రూ.56,300 కోట్ల పెట్టుబడులు
## కంపెనీల ఏర్పాటుతో దాదాపు 10,800 ఉద్యోగావకాశాలు

హైదరాబాద్, జనవరి 23 (ప్రభాత ఉదయం): గతంలో ఎన్నడూ లేనివిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం దావోస్ వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వేదికపై తెలంగాణ మరో కొత్త రికార్డు నమోదు చేసింది. గతంలో ఎన్నడూ లేనంతగా ఒకే రోజు భారీ పెట్టుబడులను సమీకరించింది. ముఖ్యంగా 3 కంపెనీల ద్వారా రాష్ట్రానికి రూ.56,300 కోట్ల పెట్టుబడులకు సంబంధించి ఒప్పందాలు కుదిరాయి. వీటి ద్వారా రాష్ట్ర యువతకు దాదాపు 10,800 ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. దేశంలో ఇంధన రంగంలో పేరొందిన సంస్థ 'సన్ పెట్రో కెమికల్స్' రాష్ట్రంలో రూ.45,500 కోట్ల పెట్టుబడులకు ఒప్పందం చేసుకుంది. రాష్ట్రంలో భారీ పంప్డ్ స్టోరేజీ, జల విద్యుత్తు, సోలార్ విద్యుత్తు ప్రాజెక్టులను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. అందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందంపై (ఎంవోయూ) సంతకం చేసింది. నాగర్‌కర్నూల్, మంచిర్యాల, ములుగు జిల్లాల్లో మూడు చోట్ల పంప్డ్ స్టోరేజీ హైడ్రో పవర్ ప్రాజెక్టులను నెలకొల్పనుంది. ఈ ప్రాజెక్టుల మొత్తం ఇంధన సామర్థ్యం 3,400 మెగావాట్లు. వీటికి 5,440 మెగావాట్ల సామర్థ్యముండే సోలార్ విద్యుత్తు ప్లాంట్లను అనుసంధానం చేస్తుంది. ఈ ప్రాజెక్టుల నిర్మాణ దశలోనే దాదాపు 7000 ఉద్యోగాలు లభిస్తాయి. ఇప్పటివరకు దావోస్ వేదికపై తెలంగాణ ప్రభుత్వం చేసుకున్న భారీ ఒప్పందం ఇదే. సన్ పెట్రో కెమికల్స్ ఎండీ దిలీప్ సాంఘ్వీతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఈ ఒప్పందంపై కీలక చర్చలు జరిపారు. పరిశ్రమల శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, ఇన్వెస్టిమెంట్స్ ప్రమోషన్ ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. సీఎం సమక్షంలో ఎంవోయూపై సంతకాలు

..మిగతా 2లో



# విస్తరిస్తున్న హైదరాబాద్ మహానగరం

## త్వరలో గ్రేటర్‌లో కలవనున్న 20 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లు

హైదరాబాద్, జనవరి 23 (ప్రభాత ఉదయం): హైదరాబాద్ మహా నగరం విశ్వ నగరంగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. ప్రపంచంలోని టాప్ సిటీల్లో హైదరాబాద్ కూడా ఒకటిగా నిలుస్తోంది. లండన్, న్యూయార్క్ వంటి ప్రపంచస్థాయి నగరాలతో పోటీపడేలా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలని రేవంత్ సర్కార్ భావిస్తోంది. ఇప్పటికే హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ ట్రైసిటీలు ఉండగా.. నగర విస్తరణలో భాగంగా ఫ్యూచర్ సిటీ పేరుతో ఫోర్త్ సిటీని కూడా నిర్మిస్తున్నారు. దాదాపు 20 వేల ఎకరాల్లో ఈ ఫ్యూచర్ సిటీ రూపుదిద్దుకోనుంది. ఇక నగర విస్తరణలో భాగంగా సర్కార్ మరో కీలక నిర్ణయం తీసుకునేందుకు రెడీ అయింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిని పెంచాలని భావిస్తోంది. ఔటర్ రింగు రోడ్డు వరకూ జీహెచ్‌ఎంసీని విస్తరణపై దృష్టిపెట్టింది. 20 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లనను గ్రేటర్‌లో కలపాలని భావిస్తోంది. ఈ క్రమంలో సాధ్యాసాధ్యాలపై ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇప్పటికే మున్సిపల్ శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా.. త్వరలోనే నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. జీహెచ్‌ఎంసీ కాకుండా ఓఆర్‌ఆర్ లోపల 20 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లు ఉన్నాయి. గ్రేటర్ హైదరాబాద్ నగరంతో పోలిస్తే అభివృద్ధిలో ఇవి వెనుకబడ్డాయి. నగరం వేగంగా విస్తరిస్తున్న క్రమంలో ఓఆర్‌ఆర్ వరకూ ఒకేవిధంగా అభివృద్ధి చేసేందుకు వాటిని జీహెచ్‌ఎంసీలో విలీనం చేయాలని రేవంత్ ప్రభుత్వం భావిస్తోంది.

# కృష్ణా జలాల కేటాయింపు వ్యవహారం

## ఏపీ పిటిషన్‌పై ఫిబ్రవరిలో విచారిస్తాం
## సుప్రీం ధర్మాసనం స్పష్టీకరణ



హైదరాబాద్, జనవరి 23 (ప్రభాత ఉదయం): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య కృష్ణా జలాల కేటాయింపు వ్యవహారంలో ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై ఫిబ్రవరిలో విచారణ చేపడతామని సుప్రీంకోర్టు తెలిపింది. కృష్ణా ట్రిబ్యునల్ నీటి పంపకాల విషయంలో గురువారం సర్వోన్నత న్యాయస్థానంలో ఏపీ ప్రభుత్వం మెన్షన్ చేయడంతో.. ఈ మేరకు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటేశ్వర్ సింగ్ నేతృత్వంలోని ధర్మాసనం నిర్ణయం తీసుకుంది. కృష్ణా ట్రిబ్యునల్‌కు సంబంధించి మూడు రాష్ట్రాల మధ్య పంపకాలు 2014కు ముందే పూర్తయిన నేపథ్యంలో రాష్ట్ర విభజన తర్వాత ఏపీ, తెలంగాణ మధ్య నీటి పంపకాల వ్యవహారాన్ని తేల్చాలని 2023 అక్టోబరులో కేంద్రం నోటిఫికేషన్ జారీ చేసింది. అంతుకుముందే తెలంగాణ ప్రభుత్వం కృష్ణా ట్రిబ్యునల్‌ను ఆశ్రయించింది. తెలంగాణ భూ భాగంలోనే కృష్ణా నది ఎక్కువగా ప్రవహిస్తోందని.. అందుకని తెలంగాణకు కృష్ణా జలాల్లో 70 శాతం వాటా ఇవ్వాలని ట్రిబ్యునల్‌ను కోరింది. లేదంటే వ్యవహారం తేలే వరకు రెండు రాష్ట్రాలకు 50శాతం చొప్పున నీటి కేటాయింపులు చేయాలని ట్రిబ్యునల్‌లో తెలంగాణ ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌పై ఇప్పటికే ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఆ పిటిషన్‌పై విచారణ కొనసాగుతుండగానే మరోసారి కృష్ణా ట్రిబ్యునల్ తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టులో ప్రత్యేకంగా ఏపీ ప్రభుత్వం మెన్షన్ చేసింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటేశ్వర్ సింగ్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు ఈ విషయాన్ని ప్రస్తావించింది. ఫిబ్రవరి 19 నుంచి కృష్ణా ట్రిబ్యునల్ విచారణ ప్రారంభం కానున్న నేపథ్యంలో అంతకుముందే తాము దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై వాదనలు విని తీర్పు ఇవ్వాలని ఏపీ కోరింది. అందుకు అనుగుణంగా స్పందించిన ధర్మాసనం.. ఫిబ్రవరి 13న మధ్యాహ్నం 2 గంటలకు వాదనలు వింటామని తెలిపింది. ఆ మేరకు తెలుగు రాష్ట్రాలు, కేంద్రం సిద్ధంగా ఉండాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

# కొత్త రేషన్‌కార్డులతో 40 లక్షల మందికి లబ్ధి: ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



హైదరాబాద్, జనవరి 23 (ప్రభాత ఉదయం): ప్రస్తుతం తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ కొనసాగుతోంది. అయితే ఇప్పటికే అప్లై చేసుకున్న వారికి సంబంధించి రేషన్ కార్డు అర్హత కలిగిన వారి జాబితాను ప్రభుత్వం విడుదల చేసింది. అయితే దరఖాస్తు చేసుకున్న జాబితాలో పేరు లేని వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఇప్పటికే గ్రామ సభలు నిర్వహిస్తున్న ప్రభుత్వం.. రేషన్ కార్డు జాబితాలో పేరు లేని వారు ఈ గ్రామసభల్లో మరోసారి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు, ప్రభుత్వం సూచిస్తోంది. దీంతో గ్రామ సభల్లో కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునే వారి సంఖ్య భారీగా పెరుగుతోంది. అయితే రేషన్ కార్డుల కోసం రాష్ట్రవ్యాప్తంగా అనేక గ్రామ సభల్లో తీవ్ర గందరగోళం, ఆందోళనలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం.. 10 ఏళ్ల పాటు రేషన్ కార్డుల జారీపై దృష్టి పెట్టలేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రాష్ట్రంలో 40 లక్షల మందికి లబ్ధి

..మిగతా 2లో

# 29వ తేదీన ఒక్కరోజే 10 కోట్ల మంది రానున్న భక్తులు

## మౌనీ అమవాస్య సందర్భంగా ప్రత్యేకంగా 150 రైళ్లు
## ప్రయాగ్‌రాజ్‌కు పోటెత్తుతున్న భక్తజనం

లక్నో, జనవరి 23 (ప్రభాత ఉదయం): ప్రస్తుతం ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళా అంగరంగ వైభవంగా జరుగుతోంది. 144 ఏళ్లకు ఒకసారి వచ్చే ఈ మహా కుంభమేళా.. ఈనెల 13వ తేదీన ప్రారంభం అయింది. మహా శివరాత్రి సందర్భంగా వచ్చే నెల 26వ తేదీతో ముగియనుంది. ఇప్పటికే కోట్లాది మంది భక్తులు గంగా, యమునా, సరస్వతి నదుల త్రివేణి సంగమం వద్ద పుణ్య స్నానాలు ఆచరించారు. అయితే ఈ 45 రోజుల మహా కుంభమేళాలో భాగంగా ఈనెల 29వ తేదీన ప్రత్యేక రోజు అని చెబుతున్నారు. మౌనీ అమావాస్య సందర్భంగా మహా కుంభమేళాకు 10 కోట్ల మంది భక్తులు రానున్నట్లు యూపీ ప్రభుత్వ వర్గాలు అంచనా వేస్తోంది. ఇందుకోసం కోట్లాది మంది భక్తులు రానున్న నేపథ్యంలో అన్ని చర్యలు చేపట్టాలని.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇక మౌనీ అమావాస్య సందర్భంగా మహా కుంభమేళాకు వచ్చే భక్తుల కోసం 150 ప్రత్యేక రైళ్లు

..మిగతా 2లో



# క్యాంపస్‌ను విస్తరించనున్న దిగ్గజ ఐటీ సంస్థ ఇన్ఫోసిస్

అదనంగా 17వేల ఉద్యోగులు
ఫస్ట్ ఫేజ్‌లో రూ. 750 కోట్లతో ఐటీ భవనాలు

2

# మీర్‌పేట హత్య కేసులో విస్తుపోయే విషయాలు



## అక్రమ సంబంధంతోనే భార్యను అడ్డు తొలగించుకునే చర్య
## గురుమూర్తి నుంచి కూపీ లాగుతున్న పోలీసులు

హైదరాబాద్, జనవరి 23 (ప్రభాత ఉదయం): మీర్‌పేట సంచలన హత్య కేసులో విస్తుపోయే విషయాలు బయటికొస్తున్నాయి. మరో మహిళతో అక్రమ సంబంధంతోనే భార్యను హత్య చేసి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. సెల్‌ఫోన్ ద్వారా గుట్టును బయటకు తీసే ప్రయత్నంలో పోలీసులు ఉన్నారు. గురుమూర్తి తన భార్యను చంపి.. మృతదేహాన్ని ముక్కలు చేసి ఉడికించి.. ఎముకలను రోట్లో వేసి దంచి పొడిగా చేసిన ఘటన సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. రంగారెడ్డి జిల్లా మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తుండగా విస్మయకర

..మిగతా 2లో



## ప్రజాపాలనలో అందరూ సమానమే

### అర్హత ఉన్న ప్రతిఒక్కరికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు
### శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి జగదీశ్వర్ గౌడ్

కూకట్‌పల్లి,జనవరి 23 (ప్రభాత ఉదయం): శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధి లోని మాదాపూర్ వార్డ్ కార్యాలయంలో అధికారుల అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నెల 26న ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న అభివృద్ధి పథకాలు - ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు అమలు మరియు లబ్దిదారుల ఎంపిక కొరకు 21 నుంచి 24 వరకు ఏర్పాటు చేయనున్న ఇందిరమ్మ సభను శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్ పరిశీలించారు. ఈ సంధర్బంగా ఆయన ప్రజలు ఎదురుకుంటున్న సమస్యలు, అధికారులు చూపిస్తున్న చొరవను అడిగి తెలుసుకున్నారు. అధికారులు ప్రజలకు అర్థం అయ్యేలా తగు చర్యలు తీసుకుంటూ వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా దరఖాస్తుల స్వీకరణ చేయాలసిందిగా సూచించారు. ప్రజలు ఎలాంటి అధైర్యం లేకుండా వారికి ఉన్న సందేహాలను అధికారులను అడిగి నివృత్తి చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమం గురించి అవగాహన లేని స్థానికులకు, తెలిసినవారు వెళ్లి వారికి తెలియజేసి, అర్హులైన లబ్ధిదారులను ఎంచుకునే క్రమంలో ప్రజలు కూడా తమ వంతు సాయం చేయాల్సిందుగా ఆయన కోరారు. మన వార్డ్ వద్దనే ఏర్పాటు చేసినటువంటి కార్యక్రమంలో పాల్గొని, దరఖాస్తులు ఇచ్చి లబ్దిదారులందరు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.



కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

## ప్రజా సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం

### ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, జనవరి 23(ప్రభాత ఉదయం) ప్రజా సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని మల్కాజ్గిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని విష్ణుపురి ఎక్స్ టెన్షన్ లో అధికారులతో కలసి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పర్యటించారు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి చొరవతో విష్ణుపురి ఎక్స్ టెన్షన్లో ఒక్క కోటి అయిదు లక్షల వ్యయంతో బాక్స్ డ్రైన్ త్వరలోనే ఏర్పాటు కానున్న సందర్భంగా అధికారులతో కలిసి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పర్యటించారు.ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గత సంవత్సర కాలంగా నియోజకవర్గ పరిధిలోని జరగవలసిన అభివృద్ధి పనులను మంజూరు చేయించాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామని, దాని ఫలితంగానే ఇప్పుడు కోటి అయిదు లక్షల బాక్స్ డ్రైన్ పనులు జరుతున్నాయని, ఇక పై అన్ని పనులను ప్రారంభించుకునే విధంగా ప్రణాళికతో ముందుకు సాగుతామని, ప్రభుత్వంలో నిధుల కొరతతో పనుల్లో జాప్యం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బల్దియా ఈ.ఈ. మహేష్. మాజీ కార్పొరేటర్ నిరుగొండ జగదీష్ గౌడ్, వాసగోని శ్రీనివాస్ గౌడ్, మురుగెశ్ , సతీష్,రాములు, రవీందర్, వేణు యాదవ్, శ్రీకాంత్, సురేష్ యాదవ్ శ్రీనివాస్ యాదవ్,నాగరాజు, వి.వీ.ఎస్.ఎన్ శర్మ తదితరులు ఉన్నారు.



## భారతదేశ శక్తిని ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత నేతాజీదే

### మాధవరం కాంతారావు

కూకట్‌పల్లి,జనవరి 23 (ప్రభాత ఉదయం) స్వాతంత్ర పోరాటం అహింసా మార్గంలోనే కాదు వీర మార్గంలోనూ తెల్లవారిపై పోరాడుదామని పిలుపిచ్చిన మహావీరుడని కూకట్ పల్లి అసెంబ్లీ బిజెపి ఇంచార్జి మాధవరం కాంతారావు అన్నారు. గురువారం అసెంబ్లీ పరిధిలోని జనతా నగర్ లో బిజెపి సీనియర్ నాయకులు యాదగిరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సుభాష్ చంద్రబోస్ జయంతి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంతారావు హాజరై నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ స్వాతంత్ర పోరాటం అహింసా మార్గంలోనే కాదు వీర మార్గంలోనూ బ్రిటర్లపై పోరాడుదామని ఆజాద్ హిందూ ఫౌజ్‌ను స్థాపించి దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలో కీలకపాత్ర వహించారు. భారత ప్రభుత్వం బోస్ జయంతిని 'పరాక్రమ్ దివస్‌గా' నిర్వహిస్తుంది. ఆయన శక్తివంతమైన నినాదం "నాకు రక్తం ఇవ్వండి, నేను మీకు స్వేచ్ఛ ఇస్తాను" భారతీయులలో దేశభక్తిని ప్రేరేపిస్తుంది. రవీంద్రనాథ్ ఠాగూర్ నేతాజీ"ని "దేశ్ నాయక్" అనే బిరుదును అందించారు. క్రమశిక్షణ, దేశభక్తి, దైవభక్తి ఉన్న సేవాతత్పరుడైన సుభాష్ చంద్రబోస్ జీవితం ఆయన పోరాట స్ఫూర్తి మనకు ఆదర్శమని కాంతారావు కొనియాడారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ మూసాపేట్ డివిజన్ మాజి అధ్యక్షులు, జిల్లా కన్వీనర్ ఈగల సాయి, బిజెపి నాయకులు కిరణ్, కిషోర్, నేతాజీ యూత్ అసోసియేషన్ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## క్యాంపస్‌ను విస్తరించనున్న దిగ్గజ ఐటీ సంస్థ ఇన్ఫోసిస్

### అదనంగా 17 వేల ఉద్యోగులు.. ఫస్ట్ ఫేజ్‌లో రూ. 750 కోట్లతో ఐటీ భవనాలు



హైదరాబాద్, జనవరి 23 (ప్రభాత ఉదయం): ప్రపంచ దిగ్గజ ఐటీ సంస్థ ఇన్ఫోసిస్ హైదరాబాద్‌లో తమ క్యాంపస్‌ను విస్తరించనుంది. పోచారంలో ఉన్న ఇన్ఫోసిస్ క్యాంపస్‌లో అదనంగా 17 వేల ఉద్యోగాలు కల్పించనున్నట్లు ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందుకు అనుగుణంగా అక్కడున్న సదుపాయాలు విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. దావోస్ ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సదస్సులో ఇన్ఫోసిస్ సీఎఫ్ఓ జయేష్ సంగ్రాజ్‌తో తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు సమావేశమయ్యారు. అనంతరం ప్రకటన విడుదల చేశారు. ఈ ఒప్పందంలో భాగంగా ఫస్ట్ ఫేజ్‌లో ఇన్ఫోసిస్ సంస్థ రూ.750 కోట్ల పెట్టుబడితో కొత్త ఐటీ భవనాల నిర్మాణం చేపడుతుంది. వచ్చే రెండు, మూడేళ్లలో ఈ నిర్మాణం పూర్తవుతుంది. ఈ కొత్త సెంటర్ రాష్ట్రంలో అభివృద్ధి చెందుతున్న ఐటీ పర్యావరణ వ్యవస్థకు గణనీయంగా దోహదపడుతుంది. దేశంలో ప్రముఖ ఐటీ గమ్యస్థానంగా తెలంగాణ ప్రతిష్టను మరింత పెంచుతుంది. ఇప్పటికే ఇన్ఫోసిస్ హైదరాబాద్‌లో దాదాపు 35,000 మంది ఉద్యోగులున్నారు. తెలంగాణ ప్రభుత్వంతో భాగస్వామ్యం పంచుకోవటం కొత్త ఆవిష్కరణలకు నాంది పలుకుతుందని, ఇప్పుడున్న ఐటీ సమూహాన్ని మరింత బలోపేతం చేయాలనే ఉమ్మడి దృక్పథాన్ని ప్రతిబింబిస్తుందని జయేష్ సంగ్రాజ్ అన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను వృద్ధి చేసే లక్ష్యంతో అన్ని రంగాల్లో ప్రముఖ సంస్థలు, పారిశ్రామిక దిగ్గజాలకు ప్రభుత్వం తగినంత మద్దతు ఇస్తుందని మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. అటు, తెలంగాణలో భారీ పెట్టుబడికి దిగ్గజ సంస్థ అమెజాన్ ముందుకొచ్చింది. దావోస్‌లో అమెజాన్ వెబ్ సర్వీసెస్ గ్లోబల్ పబ్లిక్ పాలసీ వైస్ ప్రెసిడెంట్ మైకేల్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. రూ.60 వేల కోట్ల పెట్టుబడి పెట్టేందుకు అమెజాన్ అంగీకారం తెలిపింది. ఈ మేరకు ఒప్పందం రాష్ట్ర ప్రభుత్వంతో జరగ్గా.. రాష్ట్రంలో డేటా సెంటర్లను సంస్థ విస్తరించనుంది. వీటికి అవసరమైన భూమిని కేటాయించేందుకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. దావోస్‌లో పెట్టుబడుల సమీకరణలో తెలంగాణ సరికొత్త రికార్డులు నెలకొల్పింది. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర చరిత్రలో భారీ పెట్టుబడుల రికార్డు నమోదు చేసింది. వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సులో ఇప్పటికే రూ.1.32 లక్షల కోట్ల పెట్టుబడులను సాధించింది. గతేడాది దావోస్ పర్యటనలో రాష్ట్రానికి రూ.40,232 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అప్పటితో పోలిస్తే ఈసారి మూడింతలకు మించిన పెట్టుబడులు రావటం విశేషం. సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు సారథ్యంలో తెలంగాణ రైజింగ్ బృందం దావోస్‌లో వివిధ పారిశ్రామికవేత్తలతో నిర్వహించిన సమావేశాలన్నీ విజయవంతమయ్యాయి. హైదరాబాద్‌లో ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమివ్వటం ప్రపంచ దిగ్గజ పారిశ్రామికవేత్తలను అమితంగా ఆకట్టుకుంది. దీంతో పాటు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణం, మెట్రో విస్తరణకు ప్రభుత్వం ఎంచుకున్న భవిష్యత్తు ప్రణాళికలు పెట్టుబడుల వెల్లువకు దోహదపడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వం ఎంచుకున్న తెలంగాణ రైజింగ్ 2050 విజన్ గేమ్ ఛేంజర్‌గా నిలిచింది. అన్ని రంగాలకు అనుకూలమైన వాతావరణమున్న హైదరాబాద్ గ్రేటర్ సిటీ పెట్టుబడుల గమ్యస్థానంగా మరోసారి ప్రపంచానికి చాటిచెప్పినట్లయింది. ప్రభుత్వం అమలు చేస్తున్న సరళతర పారిశ్రామిక విధానంతో పాటు ఇటీవల ప్రకటించిన క్లీన్ అండ్ గ్రీన్ పాలసీ ప్రపంచ పారిశ్రామికవేత్తలను దృష్టిని ఆకర్షించింది. దేశ విదేశాలకు చెందిన పేరొందిన 10 ప్రముఖ కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంది. ఐటీ, ఏఐ, ఇంధన రంగాల్లో అంచనాలకు మించినట్లుగా భారీ పెట్టుబడులను సాధించింది. దావోస్‌లో వరుసగా మూడు రోజుల పాటు ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాల ప్రకారం రూ.1.32 లక్షల కోట్ల పెట్టుబడులతో పాటు రాష్ట్రంలో దాదాపు 46 వేల మంది యువతకు ఉద్యోగాలు లభించనున్నాయి.

## పాత రికార్డులన్నీ బ్రేక్

మొదటి పేజీ తరువాయి...

చేశారు. సుస్థిరమైన ఇంధన వృద్ధి సాధించే తెలంగాణ లక్ష్య సాధనలో ఈ ఒప్పందం మైలురాయిగా నిలుస్తుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. భారీ పెట్టుబడులకు ముందుకు వచ్చిన సన్ పెట్రో కెమికల్స్ ప్రతినిధులను అభినందించారు. ఈ ఒక్క ఒప్పందంతో తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం గత ఏడాది దావోస్లో సాధించిన రూ.40 వేల కోట్ల పెట్టుబడుల రికార్డును సమం చేసిందని అన్నారు. భవిష్యత్తు ఇంధన అవసరాల దృష్ట్యా క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీకి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందని చెప్పారు. హరిత ఇంధన ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణను అగ్రగామిగా నిలబెట్టేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. సన్ పెట్రో కెమికల్స్ భాగస్వామ్యంతో భవిష్యత్తులో డిమాండ్‌కు అనుగుణంగా ఇంధన వనరులు సమకూరుతాయనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఒప్పందంతో రాష్ట్రంలో యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలతో పాటు నాగర్‌కర్నూల్, మంచిర్యాల, ములుగు జిల్లాలు పారిశ్రామికంగా వృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. మరోవైపు, తెలంగాణలో మరో ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ అందుబాటులోకి రానుంది. రూ.10 వేల కోట్లతో దీనిని నెలకొల్పేందుకు కంట్రోల్ ఎస్ డేటా సెంటర్స్ లిమిటెడ్ దావోస్‌లో రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందంపై సంతకం చేసింది. ఈ కంపెనీ 400 మెగావాట్ల సామర్థ్యంతో ఈ డేటా సెంటర్ నెలకొల్పుతుంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 3,600 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. అటు, రాష్ట్రంలో మానవ రహిత ఏరియల్ సిస్టమ్స్ తయారీ యూనిట్ స్థాపించనున్నట్లు జేఎస్?డబ్ల్యూ సంస్థ ప్రకటించింది. అమెరికాకు చెందిన డిఫెన్స్ టెక్నాలజీ సంస్థ అనుబంధంతో ఈ యూనిట్ నెలకొల్పనుంది. దాదాపు రూ.800 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. దీనికి సంబంధించి దావోస్? వరల్డ్



ఎకనమిక్ ఫోరమ్ సదస్సులో జేఎస్‌డబ్ల్యు డిఫెన్స్ అనుబంధ సంస్థ అయిన జేఎస్‌డబ్ల్యు యూఏవీ లిమిటెడ్ కంపెనీతో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంతో దాదాపు 200 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. రక్షణ రంగంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు తెలంగాణ అభివృద్ధిలో ఈ ప్రాజెక్టు క్రియాశీలంగా మారనుంది. ఐటీ, ఫార్మాతో పాటు అన్ని రంగాల పరిశ్రమలు తెలంగాణలో పెట్టుబడులకు ఆసక్తి ప్రదర్శిస్తున్నాయని, ఈ ఒప్పందంతో రక్షణ రంగంలో కీలక ఆవిష్కరణలతో పాటు డ్రోన్ టెక్నాలజీకి తెలంగాణ ప్రధాన కేంద్రంగా మారుతుందని సీఎం రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఒప్పందం రక్షణ రంగంలో సరికొత్త ట్రెండ్ సృష్టిస్తుందని మంత్రి శ్రీధర్ బాబు అభిప్రాయపడ్డారు.

## మీర్‌పేట హత్య కేసులో విస్తుపోయే విషయాలు

మొదటి పేజీ తరువాయి...

విషయాలు వెలుగులోకి వచ్చినట్టు తెలుస్తోంది. దర్యాప్తులో భాగంగా నిందితుడు గురుమూర్తి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని పోలీసులు పరిశీలించారు. అందులో ఓ మహిళకు సంబంధించిన ఫొటోలను గుర్తించారు. ఆ మహిళతో సంబంధం కారణంగానే భార్యను అడ్డు తొలగించుకునేందుకు.. కడతేర్చి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుడు చెప్పిన వివరాలను బట్టి సాంకేతిక ఆధారాలను సేకరిస్తున్నారు. ఈనెల 15న గురుమూర్తి, అతని భార్య వెంకటమాధవి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఓ మహిళకు సంబంధించిన విషయంపైనే వారిద్దరి మధ్య గొడవ జరిగినట్టు తెలుస్తోంది. వెంకటమాధవి తలపై మోది హత్య చేసిన తర్వాత మటన్ నరికే కత్తితో ముక్కలుగా నరికాడు. ఆ తర్వాత శరీర భాగాలను బకెట్‌లో వేసి వాటర్ హీటర్‌తో ఉడికించాడు. అనంతరం వాటిని రోకలితో దంచి మూటకట్టి చెరువులో పడేసినట్టు పోలీసులకు చెప్పాడు. అయితే, జి÷-లలెలగూడ చెరువులో పోలీసులకు ఎలాంటి ఆధారాలు లభించలేదు. కానీ, నిందితుడు చెప్పిన వివరాల ప్రకారం.. 15వ తేదీ హత్య చేసిన తర్వాత గురుమూర్తి రెండ్రోజుల పాటు మద్యం సేవిస్తూ ఇంట్లోనే ఉన్నట్టు పోలీసులు ఆధారాలు సేకరించారు. వెంకటమాధవి కనిపించడం లేదని ఆమె తల్లిదండ్రులకు 17వ తేదీ రాత్రి చెప్పాడు. దీంతో ఆందోళనకు గురైన ఆమె తల్లిదండ్రులు వెంటనే న్యూ వెంకటేశ్వర కాలనీకి వచ్చి సమీపంలో గాలించారు. చుట్టుపక్కల వారిని ఆరా తీశారు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో గురుమూర్తిని తీసుకెళ్లి.. 18వ తేదీ మీర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణలో భాగంగా పోలీసులు గురుమూర్తి నివాసానికి వచ్చిన తర్వాత సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించగా.. 14వ తేదీన వెంకటమాధవి బయటి నుంచి ఇంట్లోకి వెళ్లిన ఫుటేజీ ఉంది కానీ, ఆ తర్వాత బయటకు వెళ్లినట్టు ఆధారాలు దొరకలేదు. సాంకేతిక ఆధారాలను పరిశీలించిన తర్వాత పోలీసులు గురుమూర్తిపై అనుమానంతో అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించగా... అసలు విషయం వెలుగు చూసింది. వెంకటమాధవి శరీర భాగాలు లభ్యమైతే వారి పిల్లల డీఎన్‌ఏతో సరిపోల్చి సాంకేతిక ఆధారాలు సేకరించాలని చూస్తున్నారు. కానీ, గురుమూర్తి చెప్పిన ప్రాంతంలో ఇప్పటి వరకు మృతదేహం ఆనవాళ్లు లభ్యం కాకపోవడంతో ఈ కేసుకు సంబంధించి పోలీసులు ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. ఏపీలోని ప్రకాశం జిల్లా రాచర్ల మండలం జేపీ చెరువుకు చెందిన వెంకట మాధవి(35)కి అదే గ్రామానికి చెందిన పుట్ట గురుమూర్తి(39)తో 13 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. గురుమూర్తి ఆర్మీలో పనిచేసి పదవీ విరమణ చేసి ప్రస్తుతం డీఆర్‌డీవోలో కాంట్రాక్టు భద్రతా సిబ్బందిగా పనిచేస్తున్నాడు. రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం జిల్లెలగూడ న్యూ వెంకటేశ్వరనగర్ కాలనీలో అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు.

## 29వ తేదీన ఒక్కరోజే 10 కోట్ల మంది రానున్న భక్తులు

మొదటి పేజీ తరువాయి...

నడిపేందుకు ప్రయాగ్‌రాజ్ రైల్వే డివిజన్ ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రయాగ్‌రాజ్‌లోని 9 స్టేషన్ల నుంచి అన్ని మార్గాల్లో ఈ స్పెషల్ రైళ్లు నడుస్తాయని అధికారులు బుధవారం వెల్లడించారు. ప్రయాణికుల సౌలభ్యం కోసం కలర్ కోడ్‌తో రైల్వే టికెట్లు, వసతి ఏర్పాట్లను కూడా సిద్ధం చేయనున్నట్లు వివరించారు.మౌనీ అమావాస్య సందర్భంగా ఇప్పటికే నడుస్తున్న రైళ్లతోపాటు అదనంగా 150 ప్రత్యేక రైళ్లను ఒకేరోజు నడపడం అసాధారణ విషయమని ప్రయాగ్‌రాజ్ రైల్వే డివిజన్ పీఆర్వో అమిత్ మాలవీయ వెల్లడించారు. మౌనీ అమావాస్య నాడు 10 కోట్లమందికి పైగా భక్తులు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు చేయవచ్చని కుంభమేళా నిర్వాహకులు పేర్కొంటున్నారు. మరోవైపు.. యూపీ కేబినెట్ బుధవారం సమావేశం అయింది. ప్రయాగ్‌రాజ్‌లోని కుంభమేళా జరుగుతున్న ప్రాంతంలోనే సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆధ్వర్యంలో మంత్రులు సమావేశమై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ కేబినెట్ భేటీ ముగిసిన తర్వాత మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు సీఎం మీడియాకు వెల్లడించారు. అనంతరం మంత్రివర్గ సహచరులతో కలిసి యోగి ఆదిత్యనాథ్ త్రివేణి సంగమంలో పుణ్యస్నానం చేశారు. మరోవైపు.. ఇప్పటిదాకా రికార్డు స్థాయిలో 9.25 కోట్ల మంది త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు చేసినట్లు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తెలిపారు.

## కొత్త రేషన్‌కార్డులతో 40 లక్షల మందికి లబ్ధి

### ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మొదటి పేజీ తరువాయి...

చేకూర్చేలా కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తోందని చెప్పారు. కరీంనగర్ జిల్లాలోని నారాయణపూర్, మానకొండూరులో నిర్వహించిన గ్రామసభలకు హాజరైన ఉత్తమ్ కుమార్ రెడ్డి.. రేషన్ దుకాణాల్లో ఇక నుంచి సన్న బియ్యం పంపిణీ చేస్తామని తేల్చి చెప్పారు. అయితే రేషన్ కార్డు రాని వారు అధైర్యపడొద్దని.. అర్హులందరికీ రేషన్ కార్డులు జారీ చేస్తామని స్పష్టం చేశారు. రేషన్ కార్డులు రాలేదని ఎవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. పేదలందరికీ రేషన్ కార్డులు ఇస్తామని.. ప్రతిపక్షాలు ఆరోపణలను ఎవరూ పట్టించుకోవద్దని చెప్పారు.ప్రజాపాలన సందర్భంగా వచ్చిన అన్ని దరఖాస్తులను పరిశీలిస్తున్నామని తెలిపారు. ఈనెల 21వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన గ్రామసభలు.. ఈనెల 24వ తేదీ వరకు కొనసాగనున్నాయి. అయితే ఇప్పటికే రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నా.. అందులో పేరు లేకపోతే ఈ గ్రామ సభల్లో మళ్లీ అప్లై చేసుకోవాలని ప్రభుత్వం చెప్పడంతో.. ప్రజలు భారీగా దరఖాస్తులు చేసుకుంటున్నారు.

## ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్శిటీలో

# గిరిజన విద్యార్థులు, ఉద్యోగుల పట్ల వివక్ష

### జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్

బుద్వేల్, జనవరి23(ప్రభాత ఉదయం): తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గిరిజన ఉద్యోగులకు పదోన్నతులు ఇవ్వకపోవడం, గిరిజన బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వకపోవడం గిరిజన విద్యార్థులు. ఉద్యోగుల హక్కులను హరించడమేనని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాతోతు హుస్సేన్ నాయక్ విచారం వ్యక్తం చేశారు. ఎస్టీ కమిషన్ కు విద్యార్థులు, ఉద్యోగుల ఇచ్చిన సమస్యలను కమిషన్ ద్వారా వైస్ చాన్సలర్, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, సంబంధిత అధికారులకు అధికారిక లేఖ రాస్తానని. 15రోజులలో వారు సమాధానం ఇవ్వాలని లేనట్లయితే వారిని డిల్లీకి పిలిపిస్తానని అన్నారు. రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ – విశ్వవిద్యాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. మొదట గిరిజన విద్యార్థులు, ఉద్యోగులతో సమావేశమైనారు. ఆ తర్వాత వర్శిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, రిజిస్ట్రార్ డి.శివాజీ, ఇతర యూనివర్శిటీ అధికారులతో సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా గిరిజన విద్యార్థులు, ఉద్యోగులు, అధ్యాపకులు ఆయన దృష్టికి పలు సమస్యలను తీసుకురావడమే కాకుండ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. 2010 నుంచి ఇప్పటి వరకు ఎస్టీ ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వలేదని, కొందరు నచ్చిన వారికి అవకాశాలు కల్పిస్తు మిగతావారిని పట్టిం చుకోలేదని ఉద్యోగులు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాతోతు హుస్సేన్ నాయక్ దృష్టికి తీసుకువెళ్లారు. ఎస్టీ విద్యార్థులకు స్కాలర్షిప్ కూడా పెంచలేదన్నారు. యూనివర్శిటీ అధికారుల నియామకానికి ఎస్టీ ప్రొఫెసర్లకు ఎనిమిది సంవత్సరాల సీనియారిటీ ఉండాలనే నిభందన పెట్టారని, దానిని ఐదు సంవత్సరాలకు తగ్గించేటట్లు చూడాలన్నారు. అనంతరం ఎస్టీ కమిషన్ జాతీయ సభ్యులు హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ, ఎస్సీ ఎస్టీ విద్యార్థుల హక్కులను వ్యవసాయ విశ్వవిద్యాలయంలో హరిస్తున్నారన్నారు. టీచింగ్ స్టాఫ్ కు సరైన ప్రమోషన్లు ఇవ్వలేదన్నారు. ఎస్సీ ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయడం లేదని, ముఖ్యంగా ఎస్టీ ఉద్యోగులకు బ్యాక్ లాగ్ పోస్టులలో తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కొత్తగా వచ్చిన వైస్ చాన్సలర్ ఎస్టీ విద్యార్థులకు, ఉద్యోగులకు మేలు చేసే నిర్ణయాలు తీసుకుంటున్నప్పటికి గతంలో పనిచేసిన వైస్ చాన్సలర్ ఇష్టానుసారంగా వ్యవహరించినట్లు తెలిసిందన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 100 ఎకరాల వరకు భూమి అన్యాక్రాంతం అయ్యిందని వాపోయారు. 1500 ల ఎకరాలు



వ్యవసాయ విశ్వవిద్యాలయానికి వచ్చిన జాతీయ ఎస్టీ కమీషన్ సభ్యులు జాతోతు హుస్సేన్ నాయక్ కు పుష్ప గుచ్ఛం అందచేసి స్వాగతం పలుకుతున్న వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య

ఉన్న వ్యవసాయ విశ్వవిద్యాలయం నేడు ఐదు వందల ఎకరాలకే పరిమితమైం దన్నారు. వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నిద్రపోతున్నారా ? అని ప్రశ్నించారు. ఆయన రెండు సంవత్సరాలు ఇక్కడ ఇంచార్జ్ వైస్ చాన్సలర్ గా పనిచేశాడని, అయినా గిరిజన విద్యార్థులకు మేలు చేయలేదని, దీంతో ఈ రోజు గిరిజన ఉద్యోగులు, విద్యార్థుల నుంచి తమకు అన్యాయం జరిగిందని వంద వరకు దరఖాస్తులు వచ్చాయన్నారు. ఒక్కొక్క ప్రొఫెసర్ ది ఒక్కోక్క బాధ ఉం దన్నారు. విద్యార్థులకు డ్రెస్ అలవెన్స్ రూ. 200లు ఇస్తున్నారని, ఇది 20 సంవత్సరాల నుంచి ఇలాగే ఉందన్నారు. తెలంగాణలోని నాలుగైదు యూనివర్సిటీ లు తిరిగానని, అన్ని చోట్ల చాలా వివక్ష ఉందన్నారు. గిరిజన ఔట్ సోర్సింగ్ సిబ్బందికి నెలకు కేవలం రూ. 10వేలు మాత్రమే ఇస్తున్నారని వాపోయారు. కనీస వేతనంగా నెలకు రూ.21వేలు ఇవ్వాలన్నారు. విద్యార్థులకు 14సంవత్సరాలుగా స్టైఫండ్ పెంచలేదని ఇదెక్కడి న్యాయం అన్నారు. రాష్ట్ర బడ్జెట్ వేల కోట్లకు పెరుగుతుండగా గిరిజన విద్యార్థుల మెస్ చార్జీలు మాత్రం పెంచడం లేదన్నారు. గిరిజన కమిషన్ దగ్గరకు పోతే పని జరుగుతుందా ? అనే అనుమానాలు ఉన్నాయని, కమిషన్ దగ్గరకు వెళితే ఇబ్బందులు పెడతారని విద్యార్థులు, ఉద్యోగులు భయపడుతున్నారని వాపోయారు. గిరిజన ఉద్యోగులు జిల్లాలలో పనిచేస్తుంటే కొందరు మాత్రం రాజేంద్రనగర్ లాంటి హెడ్ క్వార్టర్ లలోనే పది నుంచి 13 సంవత్సరాలు ఉన్నారని ఇదెక్కడి న్యాయం అన్నారు. వ్యవసాయ. విశ్వవిద్యాలయానికి యూజీసీ నుంచి రావాల్సిన నిధులు వచ్చేటట్లు చూస్తానన్నారు. గిరిజన విద్యార్థులకు, ఉద్యోగులకు ఎలాంటి అన్యాయం జరిగిన జాతీయ ఎస్టీ కమీషన్ కు పిర్యాదు చేయవచ్చన్నారు. వెంటనే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

**బోధన, బేధనేతర, విద్యార్థుల సమస్యలను దశలవారిగా పరిష్కరించడానికి కృషి : వైస్ చాన్సలర్ ప్రొఫసర్ అల్దాస్ జానయ్య**

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాతోతు హుస్సేన్ నాయక్ కు వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య. ఉన్నతాధికారులతో కలసి సాదరంగా అహ్వానం పలికారు. తాను ఉప కులపతిగా మూడు నెలల క్రితమే బాధ్యతలు స్వీకరించానని అన్నారు. తాను విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ బాధ్యతలు చేపట్టాక చేపడుతున్న కార్యక్రమాలను %×% కమిషన్ సభ్యుడు హుసేన్ నాయక్ దృష్టికి తీసుకువెళ్లారు. తాను వైస్ చాన్సలర్ గా ఉన్న సమయంలో ఎస్టీ కమిషన్ సభ్యుడు విశ్వవిద్యాలయాన్ని సందర్శించడం సంతోషకరమన్నారు. ఈ మధ్యనే వర్సిటీ వజ్రో త్సవాలను నిర్వహించామన్నారు. బోధన, బోధనేతర, విద్యార్థుల సమస్యలను దశలవారిగా పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నానన్నారు.



సర్టిఫికెట్లు అందుకుంటున్న ప్రతిభ చాటిన విద్యార్థులు

## జీవశాస్త్రాన్ని ఇష్టంతో చదివి డాక్టర్లు, వ్యవసాయ శాస్త్రవేత్తలుగా ఎదగాలి

**జిల్లాస్థాయి జిల్లా స్థాయి జీవశాస్త్ర టాలెంట్ పరీక్షలో ప్రతిభ చాటిన విద్యార్థులు**

వనస్థలిపురం, జనవరి 24(ప్రభాత ఉదయం) తెలంగాణ బయోసైన్స్ ఫోరం రంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో జడ్పీహెచ్ఎస్ సాహెబ్ నగర్ వేదికగా గురువారం జరిగిన జిల్లా స్థాయి జీవశాస్త్ర టాలెంట్ పరీక్ష విజయవంతంగా ముగిసింది. తెలుగు , ఇంగ్లీష్ మీడియం , మోడల్ స్కూల్ రెసిడెన్షియల్ స్కూల్స్ మూడు విభాగాలలో పరీక్షను నిర్వహించగా రంగారెడ్డి జిల్లా 27 మండలాల నుంచి అత్యధిక సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. 30 బహుళ ఐచ్చిక ప్రశ్నలతో 45 నిమిషాల సమయంతో నిర్వహించబడ్డ ఈ పరీక్షలో విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన చూపి ఉత్తమ మార్కులను సాధించి వివిధ స్థానాలలో నిలిచారు. రంగారెడ్డి జిల్లా బయోసైన్స్ ఫోరం అధ్యక్షులు రావుల రాజ మల్లేష్ అధ్యక్షతన నిర్వహించిన ముగింపు సభలో పాల్గొన్న వక్తలందరూ నిత్యజీవితంలో జీవశాస్త్రం ప్రాముఖ్యతను పర్యావరణ సంరక్షణలో విద్యార్థుల పాత్రను విడమర్చి వివరిస్తూ విద్యార్థులందరూ జీవశాస్త్రాన్ని ఇష్టంతో చదివి డాక్టర్లు వ్యవసాయ శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆశీర్వదించారు. ముగింపు సభకు ముఖ్య అతిథులుగా జిల్లా సైన్సు అధికారి వై శ్రీనివాసరావు , గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిధర్ , డిసిఈబి సెక్రెటరీ జనరల్ అరుణ్ , స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు దినేష్ , రాధాకృష్ణ రెడ్డి , బయోసైన్స్ ఫోరం రంగారెడ్డి జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి వనమల ఆంజనేయులు , కమిటీ సభ్యులు, జిల్లా వ్యాప్తంగా ఉన్న గైడ్ టీచర్లు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

**జిల్లాస్థాయి విజేతలు**

తెలుగు మీడియం విభాగంలో కే వైష్ణవి జడ్పిహెచ్ఎస్ ఇర్విన్ మొదటి బహుమతి, ఎస్ శ్రీజ ద్వితీయ బహుమతి, జెడ్ పి హెచ్ ఎస్ తిమ్మాపూర ఎ శ్రో హిత్ జెడ్పిహెచ్ఎస్ ఇరివిన్ తృతీయ బహుమతి ఇంగ్లీష్ మీడియం విభాగంలో ఆర్ తరుణ్ జెడ్పిహెచ్ఎస్ ఆరుట్ల మొదటి బహుమతి, పి కార్తీక్ జెడ్పిహెచ్ఎస్ గణేష్ నగర్ ద్వితీయ బహుమతి, సిహెచ్ అఖిలేష్ ,జడ్పిహెచ్ఎస్ ఆరుట్ల తృతీయ బహుమతి,

మోడల్ స్కూల్ అండ్ రెసిడెన్షియల్ స్కూల్ విభాగంలో మొదటి బహుమతి ఎస్.కె అస్మ టిజిఎంఆర్ ఎస్ హయత్‌నగర్, రెండవ బహుమతి ఏ గణేష్ చంద్ర, ఎంజెబిపి బాటసింగారం, మూడవ బహుమతి కే కీర్తన. టీజీ ఎంఆర్ఎస్ హయత్ నగర్ లు సాధించారు.



ఏఐసీసీ అధినేత రాహుల్ గాంధీతో,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సయ్యద్ నసిరద్దీన్ (ఫైల్ ఫోటో)

## కాంగ్రెస్‌ను నమ్ముకున్న నాయకులకు అన్యాయం

**మాజీ ఎంపీటీసీ సయ్యద్ నసిరుద్దీన్ ఆవేదన**

శంషాబాద్,జనవరి 23( ప్రభాత ఉదయం) నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని ఉన్న పార్టీ నాయకులు కార్యకర్తలకు అన్యాయం జరుగుతున్నదని శంషాబాద్ మాజీ ఎంపీటీసీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సయ్యద్ నసిరద్దీన్ ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుదేశం హయాంలో. ఆ తర్వాత టిఆర్ఎస్ పార్టీ హయాంలో ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన కాంగ్రెస్ కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా పోరాటాలు తప్పడం లేదని అన్నారు. గతంలో టిడిపి హయాంలో టిఆర్ఎస్ హయాంలో అధికారం చలాయించిన నాయకులే మళ్ళీ ఇప్పుడు కాంగ్రెస్ నాయకులపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని నశీరుద్దీన్ ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిసిసి ప్రెసిడెంట్ మహేష్ గౌడ్ చొరవ తీసుకొని కష్టపడిన కాంగ్రెస్ కార్యకర్తలకు గుర్తింపు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## పేద బిడ్డలకు ఎందుకు లాప్‌ట్యాప్స్ పంపిణీ చేయడం లేదు

**ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్**

హైదరాబాద్, జనవరి 23 (ప్రభాత ఉదయం): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి ఏడాది గౌలిదొడ్డి (బాయ్స్) గురుకులంలో చదువుతూ ఐఐటీ, ఎన్ఐటీల్లో సీట్లు పొందిన విద్యార్థులకు ల్యాప్‌టాప్స్ అందించేవారని ఇప్పుడు ఎందుకు అందించడం లేదని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. కానీ ఈ ఏడాది మాత్రం ఇప్పటి వరకు విద్యార్థులకు ల్యాప్‌టాప్స్ అందలేదన్నారు. గొప్ప చదువులు చదవాలనుకునే గురుకుల విద్యార్థులు నిర్లక్ష్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే గురుకులాల్లో లాప్‌ట్యాప్స్ అందలేదని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు మెసేజ్ పెట్టడంతో ఈ మేసేజ్‌పై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్పందించారు. మీరు హైదరాబాద్ నుండి కరీంనగర్‌కు హెలికాప్టర్‌లో పోయిన ఖర్చుతో ఈ పేద బిడ్డలకు మంచి ల్యాప్‌టాప్స్ పంపిణీ చేయవచ్చు. రూ. 32 వేల ప్లేటు మీల్స్ గురించి నేను మాట్లాడను అని రేవంత్ రెడ్డి సర్కార్‌కు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చురకలంటించారు.

# అన్నింటికి బయటికే....





బహిరంగ ప్రదేశంలో మూత్ర విసర్జన చేస్తున్న విద్యార్థులు



ఫిల్టర్ వాటర్ కేంద్రంలో మంచినీళ్లు తాగుతున్న విద్యార్థులు

## సర్కార్ బడుల్లో సమస్యల తిష్ట

### కానరాని మరుగుదొడ్లు ఉన్నా.. నీటి సౌకర్యం సున్నా తాగునీళ్లూ కరువే

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి23(ప్రభాత ఉదయం) సర్కార్ బడుల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరుగుదొడ్లు ఉన్న చోట నీటి సౌకర్యం లేక నిరుపయోగంగా మారాయి. గద్వాల పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాలలో సుమారు 1,400 మంది విద్యార్థులున్నారు. మంచి నీళ్లు తాగడానికైనా.... ఒంటికైన( మూత్ర విసర్జనకు) స్కూల్ దాటి బయటకు పోవల్సిందే. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠశాలలో మరుగుదొడ్లులేవు. ముఖ్యంగా అమ్మాయిలకు రెండు మరుగుదొడ్లు ఉండటంతో విద్యార్థినిలు, మహిళా ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాష్ రూమ్ ల వద్ద విద్యార్థినిలు బారులు తీరాల్సి వస్తుందంటే ఆ పాఠశాలలో వసతులు ఏ విధంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. వందల సంఖ్యలో అబ్బాయిలు ఉండటంతో స్కూల్‌లో టాయిలెట్స్ లేక ఇబ్బంది పడుతున్నారు. దీంతో పాఠశాలల ఆవరణంలో టాయిలెట్స్ లేకపోవడంతో ఇంటర్వెల్ లో విద్యార్థులు, ఆ సాకుతో బహిరంగ ప్రదేశాలలో మూత్ర విసర్జన చేయాల్సి వస్తుంది. టాయిలెట్స్ కోసం వెళ్లిన విద్యార్థులు తిరిగి పాఠశాలకు రావడం లేదని, దీంతో విద్యార్థులు చదువుకు దూరమయ్యే ప్రమాదం ఉందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. విద్యార్థులు ఆరు బయట మూత్ర విసర్జనకు బయటకు వెళ్లాలన్న రోడ్డు దాటాల్సి వస్తోందని, ప్రమాదాలబారిన పడే అవకాశం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేధనకు గురవుతున్నారు.

**ఫిల్టర్ వాటర్ కరువు**

ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తాగునీటి అవసరాల కోసం మిషన్ భగీరథ పథకం ద్వారా స్కూల్ లో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకర్ కు నీటిని సరఫరా చేసి అక్కడ నుంచి ట్యాప్ ద్వారా వాటర్ సప్లయ్ చేస్తున్నారు. వాటర్ ట్యాంకర్ ద్వారా సరఫరా అయ్యే నీళ్లు దుర్వాసన వస్తుందని విద్యార్థులు మంచి నీటి కోసం బయటకు వెళ్లి ఫిల్టర్ వాటర్ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. విద్యార్థులు దప్పిక అయిందంటే ఫిల్టర్ కేంద్రాలకు వెళ్లి మంచినీళ్లు తాగే పరిస్థితి నెలకొంది. పాఠశాలల్లో మౌలిక వసతులు లేకపోవటం విద్యార్థుల డ్రాపౌట్స్‌కు దారితీస్తోంది. దీనిపై హెచ్ ఎంను వివరణ కోరగా వాటర్ ట్యాంక్ ను ఎప్పటికప్పుడు క్లీన్ చేస్తున్నట్లు, త్రాగు నీటి ఇబ్బంది లేదన్నారు.

ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంచి నీటి సౌకర్యార్థం మినరల్ వాటర్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, అదే విధంగా స్కూల్ ఆవరణలో మూత్ర విసర్జన కోసం మరుగుదొడ్లు నిర్మించాలని జిల్లా ఉన్నతాధికారులు, విద్యాధికారులు, ప్రజాప్రతినిధులను ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరారు.

### పరిశ్రమలోని యంత్రంలో పడి చేతి వేలు కోల్పోయిన కార్మికునికి

# పర్మినెంటు ఉద్యోగం ఇవ్వాలి

బుద్వేల్, జనవరి 23 (ప్రభాత ఉదయం) : కాటేదాన్ తిరుమల మెటల్ బాక్స్ పరిశ్రమలో పనిచేస్తు కుడి చేతి బొటన వ్రేలు పోగొట్టుకున్న పి.జగన్ అనే కార్మికుని పనిలో నుంచి తీసివేయకుండ ఆయనకు సరైన చికిత్స జరిపించి పర్మినెంటు ఉద్యోగిగా పరిశ్రమ ఉన్నంత కాలం అతని చేత పనిచేయించుకోవాలని సీఐటీయు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు జె.రుద్రకుమార్, సాయిబాబా లు డిమాండ్ చేశారు. ఇదే విషయాన్ని సంస్థ యజమాని శరవణ్ కుమార్ అగర్వాల్ ను కలసి వివరించారు. దానికి ఆయన ఒప్పుకున్నట్లు రుద్రకుమార్ తెలిపారు. గతంలో కూడా జగన్ కు చెందిన రెండు వేళ్లు మిషన్ లో పడి చిరిగాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నాయకులు వెంకటేశ్, జగన్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



తిరుమల మెటల్ కంపెనీ యజమానితో మాట్లాడుతున్న సీఐ టీయు నాయకులు



హైదర్‌గూడలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన వివిధ పార్టీల నాయకులు

## రాజేంద్రనగర్ సర్కిల్‌లో ఘనంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు

బుద్వేల్, జనవరి23(ప్రభాత ఉదయం): భారత దేశ స్వాతంత్ర్య పోరాటంలో యువతను చైతన్యపరిచి ఉత్తేజాన్ని నింపిన గొప్ప ధీశాలి నేతాజీ సుబాష్ చంద్రబోస్ అని అత్తా పూర్ డివిజన్ కార్పొరేటర్ మోంద్ర సంగీత గౌరీశంకర్ అన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ హైదర గూడ నేతాజీ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు సులిగె వెంకటేశ్ ఆద్వర్యంలో జరిగిన నేతాజీ సుబాష్ చంద్రబోస్ జయంతి వేడుకలలో ఆమె పాల్గొన్నారు. వివిధ పార్టీల నాయకులు, యువజన సం ఘాల సభ్యులతో కలసి నేతాజీ సుబాష్ చంద్రబోస్ విగ్రహానికి హలమాలలు వేసిన మోంద్ర సంగీత గౌరీశంకర్ మాట్లాడుతూ, దేశాభివృద్ధిలో నేటీ యువత భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఆదికార ప్రతినిది మ్యాడు రామేశ్వర్ రావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొలన్ సుబాష్ రెడ్డి, బీజేపీ చేవెళ్ల పార్లమెంటు కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి, రం గారెడ్డి జిల్లా కార్యదర్శి మోంద్ర కొమురయ్య , రాష్ట్ర నాయకులు కాడెం సుదాకర్. మాజీ కౌన్సిలర్ సోమారం రవీందర్, సామాజిక కార్యకర్త మ్యాడం మధుసూదన్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు వనం నర్సింహ్మ మాదిగ, తో పాటు వివిధ పార్టీల నాయకులు షాబాద్ విజయ్ కుమార్. కె. కిరణ్ ‘చారి, ఎస్ జయానంద్ రెడ్డి, నల్లింగ్ రమేశ్, సీహెచ్ చిన్న, వెంకటిరెడ్డి, శశికాంత్, మోహన చారి, ఎస్ జయానంద్ రెడ్డి, నల్లింగ్ రమేశ్, సీహెచ్ చిన్న, ముఖేశ్, వెంకటరెడ్డి, శశికాంత్, మోం ద్ర అయిలయ్య, ఎస్.రాజేందర్, ఆర్ శ్రీశైలం, ఎన్ గౌతమ్, ఎ.హనుమంత్ రెడ్డి, , భరత్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

**నవ యువ యువజన సంఘం ఆధ్వర్యంలో..**

నేతాజీనగర్ ప్రాథమిక పాఠశాలలో గురువారం నేతాజీ సుబాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను నవ యువ యువజన సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ క్లబ్ అధ్యక్షుడు ఎర్వ కుమారస్వామీ మాట్లాడుతూ, మాతృభూమి సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని కొనియాడారు. ఆజాద్ హింద్ ఫౌజ్ ను స్థాపించి స్వాతంత్ర్య పోరాటంలో తనకంటు ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న వ్యక్తి నేతాజీ సుబాష్ చంద్రబోస్ అని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రమేష్ రెడ్డి, కె.జగదీశ్, జి.శ్రీనివాస్, కె. కిషోర్ రెడ్డి , పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలక్రిష్ణ, ఉపాధ్యాయులు మమత, మహేశ్వర్, లక్ష్మీ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.



నేతాజీ నగర్ లో సుభాష్ చంద్రబోస్ చిత్ర పటానికి నివాళులు అర్పించిన నవ యువ యువజన సంఘం నాయకులు



## నాల్గవ వార్డులో రేషన్ కార్డులు ఇళ్ల స్థలాల కోసం 300 దరఖాస్తులు

శంషాబాద్, జనవరి 23 (ప్రభాత ఉదయం) రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తున్నది. నాల్గవ వార్డు కౌన్సిలర్ మహమ్మద్ జహంగీర్ ఖాన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలొ మున్సిపల్ చైర్ పర్సన్ కొలను సుష్మా మహేందర్ రెడ్డి కమిషనర్ సుమన్ రావు తదితరులు పాల్గొన్నారు. వార్డు పరిధిలోని ప్రజలు రేషన్ కార్డులు. ఇళ్ల స్థలాలు. ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని కోరుతూ 300 మంది దరఖాస్తులు చేసుకున్నారు. అర్హులైన లబ్ధిదారులకు అందరికీ న్యాయం జరిగేలా చూస్తామని కౌన్సిలర్ మహమ్మద్ జహంగీర్ ఖాన్ తెలిపారు. చైర్ పర్సన్ సుష్మ మహేందర్ రెడ్డి కమిషనర్ సుమన్ రావుల సహకారంతో అందరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తానని జహంగీర్ ఖాన్ తెలిపారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ రాములు. బిల్ కలెక్టర్ రాఘవేందర్. అరుణ తదితరులు పాల్గొన్నారు.



అంగన్ వాడి కేంద్రం..



కుళ్లిన కోడి గుడ్లు

## అంగన్‌వాడీ కేంద్రాలకు కుళ్లిన గుడ్లు

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి 23(ప్రభాత ఉదయం)అంగన్‌వాడీ కేంద్రాల పై అధికారుల పర్యవేక్షణ కరువైందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని అంగన్వాడీ కేంద్రాల ద్వారా గుడ్లను సరఫరా చేస్తున్నారు. కాని కాంట్రాక్టర్ల కక్కుర్తి.. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా కుళ్లిన గుడ్లు, చిన్న సైజ్ లో ఉన్న గుడ్లను సరఫరా చేస్తున్నారని లబ్దిదారులు ఆరోపిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో టేక్ హెూమ్ రేషన్ కింద పోషకాహారంగా అందించే కోడిగుడ్లలో కుళ్లిన గుడ్లు దర్శనమివ్వడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. పోషకాహారంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే ఎలా అని మండిపడుతున్నారు. ఈ క్రమంలో గద్వాల మున్సిపాలిటి పరిధిలోని జమ్మిచేడులోని 4వ వార్డులోని అంగన్ వాడీ కేంద్రంలో గర్భిణీ మహిళలకు, చిన్నారులకు ప్రతి నెలా మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని స్థానిక అంగన్‌వాడీ కార్యకర్త అందజేశారు. ఈ క్రమంలో గురువారం ఉదయం జమ్మిచేడుకు చెందిన గర్భిణీ తన ఇంట్లో కోడిగుడ్లను ఉడకబెట్టారు. గుడ్లు కుళ్లిన వాసన రావడంతో గుడ్డును పగులగొట్టగా కుళ్లిపోయి ఉండటం కన్పించింది. దీంతో వారు కంగారుపడి ఇంట్లో ఉన్న గుడ్లు అన్నింటినీ బయట పారవేశారు. కుళ్లిన గుడ్లు వచ్చాయంటూ స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తను ప్రశ్నించగా అలాంటిది ఏమిలేదన్నారు. దీనిపై ఐసీడీఎస్ సూపర్ వైజర్ దృష్టికి తీసుకెళ్లగా... నాణ్యత లేని కుళ్లిన గుడ్లు, సైజ్ తక్కువ ఉన్న గుడ్లను అంగన్ వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తే కాంట్రాక్టర్ మీద చర్యలు తీసుకుంటామన్నారు.



## తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి23(ప్రభాత ఉదయం)తపస్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర 2025 క్యాలెండర్ ను గురువారం ధరూర్ మండలం ఉప్పేర్ జెడ్పీహెచ్ఎస్ కాంప్లెక్స్ లో మండల విద్యాశాఖ అధికారి రవీంద్రబాబు, ఉప్పేర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గౌరీ శంకర్ లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తపస్ ధరూర్ మండలాధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి మరియు సభ్యులు ప్రవీణ్ కుమార్, శ్రీకాంత్, ఆంజనేయులు, చక్రవర్తి , చంద్రశేఖర్, గీతామణి, శ్రీలత, పద్మావతి, బి.ఆంజనేయులు, రవి, అంజి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్లకు భూమి పూజ చేస్తున్న ఎంపీ డీకే అరుణ

## పట్టణాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు: ఎంపీడీకే అరుణ

### సీసీ రోడ్లకు ఎంపీ డీకే అరుణ భూమి పూజ

కొత్తకోట, జనవరి 23(ప్రభాత ఉదయం) పట్టణాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు మంజూరు చేస్తుందని మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ అన్నారు. గురువారం కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ స్థానిక వార్డులలో 15 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ... అమృత్ 1 కింద రాష్ట్రంలోని కార్పొరేషన్ ల కు మహబూబ్నగర్,వరంగల్, కరీంనగర్ లకు పెద్ద ఎత్తున కేంద్ర నిధుల నుండి వందల కోట్లు ఇవ్వడం జరిగిందని అన్నారు.అలాగే అమృత్2 కింద ప్రతి మున్సిపాలిటీ కేంద్ర ప్రభుత్వ నిధుల మంజూరు అయ్యాయని అందులో భాగంగా 13 కోట్లు, అమరచింతకు,17 కోట్లు, ఆత్మకూరు,మక్తల్,నారాయణపేట,కొడంగల్ బూత్పూర్, షాద్ నగర్, కోస్గి , ప్రతి మున్సిపాలిటీ ల కు కూడా కేంద్రం నిధులు మంజూరయ్యాయని ఆ నిధుల ద్వారా వచ్చే ఎండాకాలంలో ప్రజలకు త్రాగునీటిపై ఎలాంటి ఇబ్బందులు లేకుండా నరేంద్ర మోడీ నేతృతంలో కేంద్ర ప్రభుత్వ నిధులు మరియు రాష్ట్ర ప్రభుత్వ నిధుల నుండి ప్రతి ఇంటికి నల్లల ద్వారా త్రాగు నీరు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్ రెడ్డి, కొండ ప్రశాంత్ రెడ్డి,మున్సిపల్ చైర్మన్ సుకేశిని విశ్వేశ్వర్, మున్సిపల్ వైస్ చైర్మన్ విజయమ్మ, కౌన్సిలర్ కొమ్ము భరత్ భూషణ్, నవీన్ కుమార్ రెడ్డి, నారాయణమ్మ వెంకట్ రెడ్డి, పలు బిజెపి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ఎన్ఆర్ ధాన్యం పక్కదారి

**పలుకుబడి ఉన్న మిల్లుల యజమానుల మాయా జాలం**
**తెలంగాణ వడ్లకు రెక్కలొచ్చాయి**
**మిల్లర్లకు కేటాయించిన ఆర్ఎన్ ఆర్ ధాన్యం బదులు**
**కర్ణాటక బీపీటీ వడ్లు ఆడిస్తున్న వైనం**
**సివిల్ సప్లయి శాఖలో ఓ అధికారి ఇష్టారాజ్యం**
**ధాన్యం కేటాయింపులో అసోసియేషన్ల సిఫారసే కీలకం**



గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి23(ప్రభాత ఉదయం) ప్రభుత్వం నుంచి తీసుకున్న ధాన్యం మరపట్టి బియ్యం ఇవ్వాల్సిన రైస్ మిల్లుల యజమానులు కొందరు మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. గతేడాది ఖరీఫ్ లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా పౌరసరఫరాల సంస్థ సేకరించి మిల్లర్లకు అప్పగించింది. రైస్‌మిల్లులకు అప్పగించిన ఆర్ఎన్ఆర్ ధాన్యం పక్క రాష్ట్రాలకు తరలించడంతో.. రైస్ మిల్లర్ల గోల్ మాల్ బహిర్గతం కావడం గద్వాల జిల్లాలో హాట్ టాఫిక్ గా మారింది. ప్రభుత్వం మిల్లర్లకు కేటాయించిన వరి ధాన్యం పక్క రాష్ట్రాలలో విక్రయించి రూ.కోట్లకు పడగలెత్తారు. ఇలా గడిచిన అయిదేండ్లలో మిల్లర్లకు కేటాయించిన వరి ధాన్యం బహిరంగ మార్కెట్ లో విక్రయించుకొని మిల్లర్లు లాభాల బాట పట్టినట్లు తెలుస్తోంది. సిఎంఆర్ కోసం జిల్లాలోని పలు మిల్లులకు కేటాయించిన ఆర్ఎన్ ఆర్ ధాన్యం బదులు కర్ణాటక రాష్ట్రం నుంచి తెప్పించిన బిపీటీ వడ్లను మిల్లులకు తరలించి మర ఆడిస్తున్న దందా వ్యవహారం బయటకు పొక్కింది. జిల్లాకు చెందిన ఓ ముఖ్యనేత రాష్ట్ర విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన విజిలెన్స్ అధికారులు జిల్లాలోని పలు రైస్ మిల్లులో తనిఖీలు నిర్వహించి రహస్య విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది.

### ధాన్యం కేటాయింపులు ఇలా...

2024-2025 సంవత్సరం వానకాలం సీజన్ లో ధాన్యం దిగుబడులు ఆశించిన స్థాయిలో వచ్చాయి. ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో వడ్లు కొనుగోలు చేసిన అధికారులు కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కోసం పౌర సరఫరాల సంస్థ (సీఎస్‌సీ)కు, ఆహార భద్రత సంస్థ (ఎఫ్‌సీఐ)కు కేటాయించారు. మిల్లుల నుంచి వచ్చిన బియ్యాన్ని సివిల్ సప్లయ్, ఎఫ్‌సీఐ గోదాములకు తరలించి.. అక్కడి నుంచి నేరుగా రేషన్ లబ్ధిదారు లకు పంపిణీ చేయాల్సి ఉంది. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 37 రైస్‌మిల్లులు ఉండగా కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కోసం 5.53 లక్షల క్వింటాళ్లు ఆర్ఎన్ అర్ ధాన్యం కేటాయించారు.

### ఆర్ఎన్ఆర్ బదులు.... బీపీటీ

జిల్లాలోని 37 మిల్లులకు సీఎంఆర్ కోసం ధాన్యం కేటాయిం పులకు పౌరసరఫ రాలశాఖలో పని చేస్తున్న ఓ అధికారి అనుమతి ఇచ్చారు. ఆర్ఎన్ఆర్ తోపాటు బీపీటీ తదితర సన్నరకం ధాన్యం 5.53 లక్షల క్వింటాళ్లు ఈ మిల్లులకు చేరాయి. కర్ణాటకలో ఆర్ఎన్ఆర్ ధాన్యానికి క్వింటాకు రూ.2,700-3,200 మద్దతు ధర లభించింది. దీంతో జిల్లాలోని మిల్లర్లు తెలంగాణ సీఎంఆర్ కోసం మిల్లర్లకు కేటాయించిన ధాన్యాన్ని కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలలో విక్రయాలకు పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆర్ఎన్ ఆర్ ధాన్యం బదులు కర్ణాటకలో తక్కువ ధరకు లభించే బీపీటీ ధాన్యాని కొనుగోలు చేసి గద్వాల జిల్లాలోని పలు రైస్ మిల్లులకు తరలించినట్లు, క్వింటా మీద రూ. 500 పైగా మిగులుతుండటంతో రైస్ మిల్లర్లు జేబులు నింపుకుంటున్నారు. గ్రామాలలో రైతులు పండించిన ఆర్ ఎన్ ఆర్ ధాన్యం కొనుగోలుకోసం గ్రామాలలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. కొందరు మిల్లర్లు నేరుగా నిర్వాహకులతో కుమ్మకై ఇక్కడి ధాన్యం కర్ణాట కకు తరలించి అక్కడున్న బీపీటీ ధాన్యం తెచ్చి స్థానిక మిల్లులో నిల్వ చేసినట్లు ఆరోపణలున్నాయి. జిల్లాలో పలుకుబడి ఉన్న రైస్ మిల్లర్లే కీలకంగా ఇక్కడి అర్ఎన్ అర్ పక్క రాష్ట్రాలకు తరలించి అక్కడి బిపిటి పలు మిల్లులకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా సుమారు 30 వేల క్వింటాళ్ల ధాన్యం సరిహ ద్దులు దాటినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### మిల్లులపై నిఘా ఏది??

సిఎంఆర్ రైస్ కోసం మిల్లులకు కేటాయించిన ఆర్ఎన్ ఆర్ ఇలా సరిహద్దులు దాటుతున్న జిల్లా పౌరసరఫరాల అధికారులు తనిఖీలు చేసిన సందర్భాలు ఎక్కడ కనిపించలేదు. అంతేకాకుండా జిల్లాలో కొనుగోలు కేంద్రాలకు పక్క రాష్ట్రం నుంచి వస్తున్న ధాన్యాన్ని అడ్డుకట్ట వేయలేకపోయారని గద్వాల జిల్లా రైతాంగం విమర్శిస్తున్నారు.

### ధాన్యం కేటాయింపులో అసోసియేషన్ల సిఫారసే కీలకం

వాస్తవానికి ప్రభుత్వం కొనుగోలు చేసిన వరి ధాన్యం జిల్లాలోని అన్ని మిల్లులకు సమానంగా సరఫరా చేయాలి. కానీ ఇక్కడ అలా జరగడం లేదు. రాజకీయ పలుకు బడి ఉన్న మిల్లుల యజమానులు, అసోసియేషన్ సభ్యుల సిఫార్సు మేరకే అధికారులు జిల్లాలో మిల్లులకు ధాన్యం కేటాయిస్తున్నారు. కొత్త మిల్లులు యజమానులకు ధాన్యం కేటాయించాలన్నా కొందరిని ఆశ్రయించాలి. వారి సిఫార్సు మేరకే వరి ధాన్యం కేటాయిస్తున్నారు. చిన్న మిల్లులకు తక్కువ వరి ధాన్యం కేటాయించడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల దృష్టికి ఈ విషయం తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని చిన్న మిల్లుల యజమానులు వాపోతున్నారు. అందరికీ సమానంగా ధాన్యం పంపిణీ చేయాలని వేడుకుంటున్నా వారి మాటలు పట్టించుకోకుండా వారిపై పెత్తనం చెలాయిస్తున్నట్లు తెలిసింది.

### డిఫాల్టర్లకే పెద్దపీట.. : చక్రం తిప్పుతున్న పౌరసరఫరాల శాఖ అధికారి

సీఎంఆర్ కింద ఇచ్చిన ధాన్యం మర ఆడించి కొన్ని మిల్లులు పౌరసరఫరాలశాఖకు అప్పగిం చాయి. కొన్ని మిల్లులు ఇప్పటికీ సీఎంఆర్ ఇవ్వాల్సి ఉంది. దాదాపు 167 ఏసీకేల బియ్యం ఇంకా ప్రభుత్వానికి బకాయి ఉన్నట్లు సమాచారం. బియ్యం విలువ రూ.20 కోట్ల వరకు ఉంటుంది. మిల్లుల్లో ధాన్యం నిల్వలు లేనట్లు సమాచారం. 2024-25 వానాకాలం సీజన్ ధాన్యం కేటాయింపుల్లో డిఫాల్టర్లకు అత్యధికంగా ధాన్యం కేటాయించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీని వెనుక పౌరసరఫరాల శాఖ అధికారి ఒకరు తనదైన రీతిలో చక్రం తిప్పినట్లు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. మొత్తం 5.53 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయగా 33 మిల్లులకు 3.50 లక్షల క్వింటాళ్లు కేటాయించగా మిగిలిన నాలుగు మిల్లులకే 2 లక్షల క్వింటాళ్లు కేటాయించడం గమనార్హం. విజిలెన్స్ విచారణపై జిల్లా డీఎస్వో స్వామికు మార్ వివరణ కోసం ప్రయత్నించగా ఆయన చరవాణిలో అందుబాటులోకి రాలేదు.

### అవకతవకలకు పాల్పడితే చర్యలు

జిల్లాలో రైస్ మిల్లులపై విజిలెన్స్ అధికారుల తనిఖీలు నిర్వహిస్తున్న విషయం వాస్తవమే. రైసు మిల్లర్ల విషయంలో మేము కఠినంగా వ్యవహరిస్తాం: లక్ష్మీనారాయణ, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)...

ఎవరైనా అవకతవకలకు పాల్పడినట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటాం. జిల్లాలో సన్నవడ్లు కేటాయించిన మిల్లులో మిల్లుల టన్నేజ్ ను బట్టి వడ్లు కేటాయించాం. అంతేతప్ప ఇందులో ఎలాంటి అవకతవకలకు స్థానం లేదు.

# మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి:

## ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి



మహిళా సమాఖ్య భవనాన్నికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం..



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

### మహిళలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుంది: జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి 23(ప్రభాత ఉదయం) మహిళలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ అన్నారు. గురువారం దౌదర్ పల్లి మెడికల్ కళాశాల వద్ద ఐదు కోట్ల రూపాయల వ్యయంతో జిల్లా మహిళ సమాఖ్య భవన నిర్మాణ పనులకు స్థానిక శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో కలిసి భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెంది కోటీశ్వరులు కావాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా ప్రతి సంవత్సరం పాఠశాలల విద్యార్థులకు రెండు జతల స్కూల్ యూనిఫారాలు కొట్టేందుకు అవకాశం కల్పించడం జరిగిందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా జిల్లాకు 7 వేల ఇండ్లు మంజూరు కాబోతున్నందున, ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ఇటుకల తయారీ యూనిట్లను మహిళా సంఘాలకు అందించేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. మహిళా సంఘాలకు బ్యాంకులు కూడా విరివిగా రుణాలు మంజూరు చేస్తున్నందున సోలార్ యూనిట్లు, పౌల్ట్రీ, ఫిష్ యూనిట్లు మంజూరు చేసి ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పడుతుందన్నారు. ఇంతేగాక రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం, రూ. 500 లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ లాంటి పథకాలు అమలు చేయడం జరుగుతుందని గుర్తుచేశారు. కోయంబత్తూరులో మహిళా సంఘాలకు అమలు చేస్తున్న కార్యక్రమాలపై ఆసక్తిగల జిల్లా మహిళా సంఘాల మహిళలను ఎంపిక చేసి శిక్షణ ఇప్పించేందుకు పంపించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని మహిళా సంఘాలు వివిధ రకాల వ్యాపారాలు నిర్వహించి ఆర్థికంగా అభివృద్ధి చెంది రాష్ట్రంలో రోల్ మోడల్ గా నిలువాలని ఆకాంక్షించారు. ఈ భవన నిర్మాణాన్ని సెప్టెంబర్ మాసం వరకు పూర్తి చేయడం జరుగుతుందని, కార్పొరేట్ స్థాయిలో భవనాన్ని నిర్మించి ఇందులో అన్ని సదుపాయాలతో పాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ.. మహిళా సంఘాల కోసం ఒక ఎకరం 15 గుంటల స్థలంలో రూ. 5 కోట్ల వ్యాయంతో నూతన భవన నిర్మాణం చేపట్టడం సంతోషదాయకమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు సోలార్ యూనిట్లు అందించి ఆదాయం సమకూర్చనున్నందున మహిళలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉదన్నారు. తమ ఇళ్లలో వివిధ రకాల ఉత్పత్తులను తయారు చేసి విక్రయించుకునే విధంగా కాటేజ్ ఇండస్ట్రీలను ఏర్పాటు చేయాలని, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందినందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల ద్వారా పెద్ద పెద్ద వ్యాపారాలు నిర్వహించాలని, ఇందుకు బ్యాంకర్లు మహిళా సంఘాలకు సబ్సిడీతో కూడిన రుణాలు అందించడం జరుగుతుందని తెలిపారు. సోలార్ యూనిట్లుతొ పాటు గొర్రెలు, కోళ్లు, ఫిష్ యూనిట్లు నెలకొల్పుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. మహిళా సంఘాల సభ్యులకు శిక్షణ కార్యక్రమాలతో పాటు రోజు వారి కార్యక్రమాలు నిర్వహించుకునే విధంగా మహిళా సంఘం భవన నిర్మాణం చేపట్టడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ నరసింహారావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతు, పంచాయతీరాజ్ ఈ ఈ దామోదర్ రావు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సంగీత, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధాప్య పెన్షన్లు ఆపడం సరికాదు: హరీశ్‌రావు

హైదరాబాద్, జనవరి 23(ప్రభాత ఉదయం) వృద్ధులకు వృద్ధాప్య పెన్షన్లు ఆపడం సరికాదని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. పెన్షన్లలో కోతలు విధించడమంటే.. వారి నోటికాడి బుక్కను లాగేసుకోవడమే అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం నంనూరు గ్రామ పంచాయతీలో కొడుకు ఇంటి పన్ను కట్టలేదని తల్లి వృద్ధాప్య పెన్షన్‌లో కోత విధించిన ఘటనపై హరీశ్‌రావు స్పందించారు. కొడుకు ఇంటి పన్ను కట్టకుంటే, తల్లికి వచ్చే వృద్ధాప్య పింఛన్ ఆపడం అన్యాయం, అమానుషం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయాలు, అధికారుల తీరు కుటుంబ సభ్యుల మధ్య చిచ్చు పెట్టే విధంగా ఉన్నాయి. పింఛన్ డబ్బులను కూడా ఇంటి పన్ను కింద జమ చేసుకుంటే, ఆ వృద్ధుల బతుకు బండి నడిచేది ఎట్ల? అని హరీశ్‌రావు ప్రశ్నించారు.అధికారంలోకి వస్తే ప్రతి నెలా రూ.4 వేలు పింఛన్ ఇస్తామని చెప్పి, ఇప్పుడు వచ్చే రూ. 2 వేల పింఛన్‌ను గుంజుకోవడం దుర్మార్గమైన చర్య అని హరీశ్‌రావు మండిపడ్డారు. ఒకవైపు లబ్దిదారుల్లో కోత విధిస్తూ, మరో వైపు చేతికందిన పింఛన్‌ను ఇంటి పన్ను బకాయిలో జమ చేయడం శోచనీయం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం నంనూరు గ్రామ పంచాయతీ పరిధిలో 15 మంది వృద్ధులకు వెంటనే పింఛన్లు చెల్లించాలని, ఇంటిపన్ను, ఇతర కారణాలు చెప్పి పింఛన్లు ఆపకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.



## అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు: జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి 23(ప్రభాత ఉదయం) ప్రభుత్వ సంక్షేమ పథకాలకు లబ్దిదారుల ఎంపిక కోసం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ సభలు కొనసాగుతున్న నేపథ్యంలో గురువారం గద్వాల్ మండలం వీరాపురం గ్రామంలో నిర్వహించిన గ్రామ సభకు జిల్లా ఎస్పీ టి శ్రీనివాస రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామానికి సంబంధించిన సంక్షేమ పథకాల అర్హత జాబిత, తదితర వివరాలను పరిశీలించి ప్రజలతో మాట్లాడుతూ... అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా సంబంధిత అధికారులు కృషి చెయ్యడం జరుగుతుందని, ప్రజలకు ఎలాంటి విజ్ఞప్తిలు /అభ్యంతరాలు ఉన్న సంబంధిత వ్యవసాయ, రెవిన్యూ, గ్రామ పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని తెలియజేశారు. అనంతరం పోలీస్ బందోబస్తును పరిశీలించి ఏలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా వుండాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఏదైన గ్రామం లో సమస్య తలెత్తితే వెంటనే హాజరు కావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గద్వాల్ రూరల్ ఎస్సై శ్రీకాంత్, వ్యవసాయ, రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శి, పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి 23 (ప్రభాత ఉదయం) తాళంవేసి ఉన్న ఇంటి తాళం పగుల గొట్టి బంగారం, నగదును చోరీ చేశారు. ఈ ఘటన గురువారం గట్టు మండల కేంద్రంలో చోటుచేసుకుంది. గట్టు ఎస్ఐ కెటి మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం ...గట్టు గ్రామానికి చెందిన ఉలిగప్ప గురువారం ఇంటికి తాళం వేసి బైక్ పైన వాళ్ళ అమ్మను వ్యవసాయ పొలం దగ్గర విడిచి పెట్టాడు. అక్కడ నుంచి ఇదుపునూరులో గొర్రెలు కాస్తున్న వాళ్ళ నాన్న దగ్గరకు బయలుదేరగా తండ్రి వద్దని చెప్పడంతో తిరిగి ఇంటికి వచ్చేశాడు. ఇంటికి చేరుకున్న బాధితుడు ఇంటి తలుపులు తెరిచి ఉండటాని గమనించాడు. ఇంట్లోకి వెళ్లి చూడగా ఇంట్లో ఉన్న పెట్ట తాళం విరగొట్టి ఉండటాని గమనించారు. పెట్టెలో దాచి పెట్టిన మూడున్నర తులాల బంగారం ఆభరణాలు, రూ. 30 వేల నగదు ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు నగదు చోరీ జరిగినట్లు గుర్తించారు. ఈ ఘటనపై గురువారం బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. “RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608